కొంగుబంగారం..బాలేశ్వరుడు

- నేటి నుంచి నవరాత్రోత్సవాలు
- తరలిరానున్న భక్తులు
- 4న రథోత్సవం



ముస్తాబైన బాలేశ్వరస్వామి ఆలయం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకేంద్రంలోని సమీప పవిత్ర పెద్దవాగు నది తీరాన భక్తుల కొంగుబంగారమైన బాలేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 4 వరకు కొనసాగుతాయి. అదేరోజు సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. మరుసటి పూర్ణాహుతితో ముగుస్తాయి. ప్రతీరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. రథోత్సవం పురస్కరించుకొని వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం మున్సిపాలిటీ, ఆలయ కమిటీ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆలయ చరిత్ర..

నాలుగు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతాన్ని గోండు రాజులు పాలిస్తున్న కాలంలో పెద్దవాగు ఒడ్డున ప్రస్తుతం దేవాలయం ఉన్న ప్రాంతంలో ఓ రైతు చేనులో నాగలి పట్టి దున్నుతున్నాడు. ఆ సమయంలో నాగలికి ఏదో తగిలినట్లు అనిపించగా తవ్వి చూడగా శివలింగం బయటపడిందని పూర్వీకులు చెబుతుంటారు. ఆ శివలింగాన్ని అక్కడే ప్రతిష్ఠించారు. గోండురాజులు రాతితో దేవాలయాన్ని నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. నేటికి శివలింగంపై నాగలి తగలడం వల్ల ఏర్పడిన గాటును గమనించవచ్చు. అప్పటి నుంచి ప్రజలు, కమిటీ ద్వారా నిత్యం పూజలు కొనసాగుతున్నాయి. తదుపరి రాంచందర్‌రావ్(పైకాజీ)ఆలయానికి ప్రహరీ నిర్మించారు. నదీ ప్రవాహానికి కోతకు గురికాగా ప్రత్యామ్నాయంగా పిల్లర్లు వేసి కప్పుభాగాన్ని మరింత పెంచి, మందిరం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తదనంతరం దండనాయకుల నారాయణరావ్(రమేశ్ బాబు) కొన్నేళ్ల నిర్వహణ చూసుకోగా, పట్టణ ప్రముఖులు టీఆర్ బాబురావ్ ఆలయ ఈశాన్యంలో ఉన్న హనుమంతుడి విగ్రహానికి మందిరం నిర్మించి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మెట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆలయం వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.



సిద్ధమైన రథం

నేటి నుంచి హోమాలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం తొలిరోజు శ్రీ లక్ష్మీగణపతి హోమం, రెండో రోజు శ్రీ చండీ సప్తశతి హవనం, మూడో రోజు నవగ్రహ హోమం, అరుణ హోమం, నాలుగో రోజు ఆరోగ్యం భాస్కరాదిచ్చేత్, ఐదో రోజు కుంకుమార్చనలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, ఆరో రోజు శ్రీ పార్వతీసమేత బాలేశ్వరస్వామి ఉత్సవమూర్తుల రథోత్సవం (రథసప్తమి)జాతర కొనసాగనుంది.

రథోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

ఫిబ్రవరి 4న సాయంత్రం 4.30 ప్రారంభమయ్యే శ్రీ పార్వతి సమేత బాలేశ్వర స్వామి రథోత్సవాన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ, మున్సిపాలిటీ,విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. తరలివచ్చే భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేపట్టనున్నారు. అందుకతగ్గట్టుగా ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తోంది.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు



లింగాపూర్‌లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

- జనావాసాల మధ్య, రోడ్ల పక్కన ఏర్పాటు
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

లింగాపూర్: మండలంలోని 14 పంచాయతీల్లో జనావాసాల మధ్య, రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటికి కంచెలు ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. మరికొన్నిచోట్ల గద్దెలు నిర్మించకుండా ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. సిర్పూర్(యూ) నుంచి లింగాపూర్ మండలానికి 33/11 కేవీ విద్యుత్ సరఫరా అవుతోంది. గ్రామాల్లోని చాలాచోట్ల కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మేత కోసం వెళ్లే పశువులు విద్యుత్ షాక్ బారినపడి మృతిచెందే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలోని ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఈ కాలనీల్లో ప్రధాన రోడ్డుపై నుంచి వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. చుట్టూపక్కన దుకాణాలు, బట్టల షాపులు ఉన్నాయి. అక్కడికి వచ్చే వాహనాలకు షార్ట్ సర్క్యూట్ జరుగుతుందోమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



సిర్పూర్(యూ) నుంచి లింగాపూర్ మండలానికి కరెంట్ సరఫరా అవుతోంది. గ్రామాల్లో డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్లకు గద్దెలతోపాటు కంచెలు ఏర్పాటు చేయాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– జాటోత్ రాహుల్, లింగాపూర్

క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఈవో యాదయ్య

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఇన్‌చార్జి డీఈవో యాదయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అధికారుల అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలు తరచూ గైర్హాజరవుతున్నారని గమనించి మెమో జారీ చేశారు. అనంతరం మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులకు అందుతున్న భోజన వసతి, వంట గదిని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దాలి



గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని నాగమ్మ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పేర్కొన్నారు. నాగమ్మ చెరువులో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని బుధవారం పరిశీలించారు. నాయకులు కిజర్‌హుస్సేన్, ఇఫాత్‌హుస్సేన్, దుర్గం విక్రమ్, తోట మహేశ్, సోగల రమేశ్, తుకారాం, మధుకర్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

'బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న దుర్గం ప్రశాంత్

వాంకిడి: ప్రజా గాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రి స్థాయిలో ఉండి అవగాహన రహితంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖోబ్రగడె విలాస్, మారుతి, శివాజీ, గణేశ్, ప్రకాశ్, పండు, యుగాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై రాములు

సిర్పూర్(టి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిర్పూర్(టి) ఏఎస్సై రాములు అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమవెంట వాహన ధ్రువపత్రాలను తెచ్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. అనంతరం కళాబృందం సభ్యులతో విద్యార్థులకు వివరించారు. కళాబృందం సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేకర్, శ్రీనివాస్, రజిత సంఘవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలి

రెబ్బెన: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పంచాయతీ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్మికులు బుధవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. కార్మికులు నర్సయ్య, కొండాలక్ష్మి, రాజమ్మ, శోభ, రాజేశ్వరి ఉన్నారు.

బాలికల భవిష్యత్‌కు బాటలు వేద్దాం



విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: బాలికలను చదివించుకుని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవం, బేటీ బచావో బేటీ పడావో ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ప్రశంసాపత్రాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్, జీసీడీవో శకుంతల, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు శారద, మమత, రాణి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ పరిశీలన

ఆసిఫాబాద్: జిల్లాలోని ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌లో నాణ్యత పాటించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో రుచికరమైన ఆహారం అందించాలన్నారు. శుచి, శుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ, నిర్వాహకులు స్వరూపరాణి ఉన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

'ధరణి' దరఖాస్తులు పునఃపరిశీలించాలి

కాగజ్‌నగర్‌రూరల్: వివిధ సమస్యలపై ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తుల పునఃపరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తుల పునఃపరిశీలనపై డివిజన్‌లోని అన్ని మండలాల తహసీల్దార్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ దరఖాస్తులను పునఃపరిశీలన పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ధరణిలో ఒక్క దరఖాస్తు పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. సమావేశంలో కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డివిజన్‌లోని తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఎమ్మెల్యే పూజలు



సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంతోపాటు నక్కలగూడలోని సమ్మక్క-సారలమ్మలను ఎమ్మెల్యే కోవలక్ష్మి బుధవారం దర్శించుకున్నారు. మౌని అమావాస్య సందర్భంగా ఇందిరానగర్‌లోని కాలభైరవ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలోని గుహలో మహంకాళి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకుడు దేవార వినోద్ ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె హామీఇచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సౌందర్య, రెబ్బెన మాజీ సర్పంచ్ అహల్యాదేవి, మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, అరుణ, నాయకులు శ్రీధర్, దుర్గం తిరుపతి, ఆనంద్, పందిర్ల మధునయ్య, దుర్గం భరద్వాజ్ పాల్గొన్నారు.



కనకదుర్గాదేవి, మహంకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

నర్సరీ పనులు పరిశీలన

వాంకిడి: మండలంలోని బంబార, గోయెగాం, సోనాపూర్ పంచాయతీల్లో నర్సరీ పనులను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఉదయం, సాయంత్రం మొక్కలను నీరుపట్టాలన్నారు. కలుపు లేకుండా చూడాలని సూచించారు. ప్రైమరీ బెడ్లలో విత్తనాలు నాటి మొక్కలు పెంచాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకాన్ని చేపట్టాలని కార్యదర్శులు, ఎఫ్ఏలను ఆదేశించారు.



పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

ఏఐటీయూసీ డైరీ ఆవిష్కరణ

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ బుధవారం ఏఐటీయూసీ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కట్టుబడి పని చేస్తోందన్నారు. వారి సమస్యలను సంఘాల నాయకులు యాజమాన్యం దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఉపేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో నరేందర్, మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు సాగర్, సంతోష్, రఘు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న జీఎం శ్రీనివాస్

ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం కార్యవర్గం

దహెగాం: ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బుర్స రవీందర్, అధ్యక్షుడిగా టేకం సుధాకర్, ఉపాధ్యక్షుడిగా ఎరుగటి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా కొడిపె నవీన్, సహాయ కార్యదర్శిగా ఆత్రం మొండయ్య, సంయుక్త కార్యదర్శిగా గొంతయ్య, సాంస్కృతిక కార్యదర్శిగా బొలిశెట్టి వెంకటేశ్, కోశాధికారిగా మానెపల్లి లచ్చన్న, కార్యవర్గ సభ్యులుగా సంతోష్, నాయిని గొంతయ్య, కొద్దెన లచ్చన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య మాట్లాడుతూ కొలవార్ సంఘం అభివృద్ధికి పాటు పడాలని సూచించారు.సంఘం నాయకులు పాల్గొన్నారు.

1న జాతర ఏర్పాట్లపై సమావేశం

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు నిర్వహించే జాతర ఏర్పాట్లపై ఎంపీడీవో కార్యాలయంలో శనివారం శాఖల అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకరమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని సూచించారు.

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా

ఆసిఫాబాద్: వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవ్ తెలిపారు. జిల్లాలోని ట్రాన్స్‌కో ఇంజినీర్లు, సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలోని కుమురం భీం జిల్లాకు తనను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. వేసవి సంబంధించిన విద్యుత్ కార్యాచరణ ప్రణాళికలో పురోగతిలో ఉన్నవి, ఇంకా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు.

'నిబంధనలకు విరుద్ధంగా పోటీలు'

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఎంపీపీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బ్రహ్మణ సమాజ్ యూత్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్, డీఈవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. విద్యార్థులకు పాఠశాల సమయంలో అనుమతి లేకుండా ఎంపీపీ క్రీడలు నిర్వహించడం సరికాదన్నారు.

మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని బోదంపల్లి, కన్నెపల్లి, గురుడుపేట, కౌటాల, తాటిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌటాల-తుమ్మిడిహెట్టి వరకు బీటీ రోడ్డు రెన్యువల్ కోసం రూ.8.20 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కాగజ్‌నగర్‌లో స్థలం ఉన్న వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, కనికి గ్రామంలో రూ.16 కోట్లతో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కౌటాల మీదుగా త్వరలో జాతీయ రహదారి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వేసవిలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చేనెలలో కౌటాల 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తామన్నారు. తన హయాంలో నియోజకవర్గానికి సాగునీరు, మెరుగైన రవాణా, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. తాటిపల్లి మిర్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, నాయకులు మల్లయ్య, మోతిరాం, యశ్వంత్, చందు, భీమయ్య, రావుజీ, తిరుపతి, శ్రీకాంత్, సంతోష్, మధుకర్, దత్తు, విజయ్ పాల్గొన్నారు.



కౌటాలలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

నేడు పుష్కరఘాట్లు ప్రారంభం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకేంద్రంలోని బాలేశ్వరస్వామి ఆలయం సమీప పెద్దవాగు (ఉత్తరవాహిణి) వద్ద సిద్ధం చేసిన పుష్కర ఘాట్లను గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కోవలక్ష్మి ప్రారంభిస్తారని నవజ్యోతి సాంస్కృతిక వ్యవస్థాపకులు దండనాయకుల రామారావ్, సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వీటికి నర్మద, సరస్వతి ఘాట్లుగా నామకరణం చేసినట్లు ప్రకటించారు. భక్తుల స్నానాలకు, విశ్రాంతికి, దుస్తులు మార్చుకోవడానికి వసతులు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు గురువారం మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ఏటిగూడ, 9.30 గంటలకు ఎలకపల్లి(బి), 10 గంటలకు చిన్న సిద్దాపూర్, 10.30 గంటలకు ఎల్లారం పోచమ్మ ఆలయం విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొంటారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, దైవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

డిగ్రీ అడ్మిషన్లపై అవగాహన

నార్నూర్: ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లపై కళాశాల యాజమాన్యం బుధవారం నార్నూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలలు, ఏకలవ్య జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫిజికల్ డైరెక్టర్ అనిత, రాణి, శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందాలన్నారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని సూచించారు. అధ్యాపకులు ప్రవీణ్, జావీద్ ఉన్నారు.

విద్యార్థులు కష్టపడేతత్వం అలవర్చుకోవాలి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలుర పాఠశాలలో, లాల్ టేక్డిలోని గిరిజన సంక్షేమ కళాశాలతో పాటు యేంద గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో నూతన అదనపు గదులు, వంట గదుల భవన నిర్మాణాలకు ఎంపీ గోడం నగేశ్‌తో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.